ప్రజాశక్తి

గురువారం 6 మార్చి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



- విశాఖలో నేడు14 మద్యం షాపులకు వేలం
- 316 దరఖాస్తులతో ఎక్సైజ్‌కు రూ.6.32 కోట్ల ఆదాయం
- బినామీలను దింపిన బడా వ్యాపారులు

గీతకు గాలం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దరఖాస్తులు వారివే.. కానీ దర్పం మాత్రం బడాబాబులది. గీత కార్మికులకు మద్యం షాపులను లాటరీలో ఇచ్చే ప్రభుత్వ విధానం వెనుక అసలు రహస్యం ఇదే. కల్లు గీత కార్మికులకు మద్యం అమ్మకాల్లోనూ భాగస్వామ్యం కల్పించి ఆర్థికంగా వారిని ముందుకు తీసుకెళ్లాలన్న విధానానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కానీ ఆచరణలో గుండగుత్తగా కొంతమంది బడా వ్యక్తులే గీత కార్మికుల వెనుక ఉండి దరఖాస్తులు చేయించి షాపులకు యజమానులుగా మారిపోతున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమే. ప్రభుత్వం గీత కార్మికులకు షాపులిచ్చామంటూ లెక్కలు రాసుకోడానికి మాత్రమే తాజా విధానం దోహదపడుతోంది. నగరంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో నేడు 14 మద్యం షాపులకు వేలం పాట జరుగనుంది. ఇది వరకూగల మద్యం షాపుల ఓనర్లే ఇక్కడ గీత కార్మికులను ఆర్థికంగా కొల్లగొట్టబోతున్నారు. కొద్ది నెలల క్రితం విశాఖలో 145 షాపులను ఎలాగైతే మద్యం దుకాణాల వేలంలో అత్యధికంగా బడాబాబులు, సంస్థలు దక్కించుకున్నాయో ఇక్కడా అవే దృశ్యాలు గురువారం కనపడనున్నాయి. ఎక్సైజ్ శాఖ అధికారులు ఈ విషయంపై మాట్లాడుతూ గీత కార్మికులకే దరఖాస్తులు ఇచ్చామని, లైసెన్సులు గీత కార్మికుల పేరునే కచ్చితంగా ఉంటాయని అంటున్నారు.

ఇబ్బడి ముబ్బడిగా దరఖాస్తులు

జివిఎంసి పరిధిలో 14 షాపులకు వేలం ప్రక్రియ గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ చేపడుతున్నారు. ఈ క్రమంలో విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేపట్టారు. మొన్నటివరకూ ఎంఎల్‌సి కోడ్ ఉండడంతో ఫిబ్రవరి 11న జరగాల్సిన వేలం ప్రక్రియను మార్చి 6కు వాయిదా వేశారు. దరఖాస్తు ఫీజు గీత కార్మికులకు రూ.2 లక్షలే కావడంతో ఇబ్బడి ముబ్బడిగా మిగతా 2లో..

నేడు బాబు, నిర్మలా సీతారామన్ పర్యటన

పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గురువారం జిల్లాలో జరగబోయే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ల పర్యటనకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు అధికారులకు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పలు ఆదేశాలు జారీ చేశారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన ఏర్పాట్ల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం గీతం యూనివర్సిటీలో జరిగే ఓ పుస్తక ప్రారంభోత్సవ కార్యక్రమంలో సిఎం, కేంద్ర మంత్రి పాల్గొంటారని తెలిపారు. శాంతి భద్రతలు, సెక్యూరిటీ పరమైన అంశాల్లో పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ప్రయాణించే దారిలో రోడ్లపై బ్యానర్లు, విద్యుత్ తీగలు, పోస్టర్లు తొలగించాలని జివిఎంసి, విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విశాఖ ఎయిర్ పోర్టు వద్ద స్వాగతం, వీడ్కోలుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ చూసుకోవాలని విశాఖ ఆర్‌డిఒకు సూచించారు. ఈ సమావేశంలో డిసిపి అజిత, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, ఆర్‌డిఒ పి.శ్రీలేఖ, డిప్యూటీ కలెక్టర్ సత్తిబాబు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి షెడ్యూల్

గురువారం ఉదయం 10.15 గంటలకు విశాఖలోని ఎన్‌టిఆర్ భవన్ వద్ద చంద్రబాబు బయలుదేరి గీతం యూనివర్సిటీకి 10.30కి చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అక్కడ జరిగే పుస్తక ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతారు. అనంతరం అక్కడ నుంచి నేరుగా విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. తర్వాత ఢిల్లీ వెళ్తారు.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి షెడ్యూల్

గురువారం ఉదయం గీతం యూనివర్సిటీలో జరిగే పుస్తక ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొంటారు. ఆమె విశాఖలోని నోవాటెల్ హోటల్ నుంచి అక్కడకు ఉదయాన్నే బయలుదేరుతారు. పుస్తకావిష్కరణ కార్యక్రమం తరువాత బడ్జెట్ అంశాలపై నోవాటెల్ హోటళ్లో మధ్యాహ్నం నిర్వహించే సదస్సులో కీలకమైన అధికారులు, పారిశ్రామికవేత్తలు, నిపుణులతో భేటీ అవుతారు. బడ్జెట్‌కు సంబంధించిన వివిధ అంశాలపై చర్చిస్తారు. అనంతరం మీడియా ప్రతినిధులతో జరిగే కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

వార్త 3లో..

ఘనంగా ఇగ్నో స్నాతకోత్సవం

వార్త 2లో..

దారపాలెంలో దర్జాగా కబ్జాలు

వార్త 3లో..

విజయసాయి కుమార్తెపై చర్యలు తీసుకోండి

హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి : విశాఖ జిల్లా భీమునిపట్నం పరిధిలో సిఆర్‌జెడ్ నిబంధనలకు వ్యతిరేకంగా సముద్ర తీరానికి సమీపంలో కాంక్రీట్ గోడ నిర్మించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె పెనక నేహారెడ్డి కంపెనీపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎపి కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌ను హైకోర్టు ఆదేశించింది. జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి నిపుణుల కమిటీ వేయాలని కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖను ఆదేశించింది. అలాగే కాంక్రీట్ గోడ కూల్చివేతకు అయ్యే ఖర్చు మొత్తాన్ని ఆ కంపెనీ నుంచే రాబట్టాలని జివిఎంసి కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. కాంక్రీట్ గోడను పూర్తిగా తొలగించకపోవడాన్ని తప్పుబట్టింది. ఈ విషయాన్ని నివేదికలో పేర్కొనలేదని ఆక్షేపించింది. ఇసుక కింద 588 మీటర్ల పొడవు, ఆరు అడుగులు లోతున్న గోడ పునాదులను కూడా తొలగించాల్సిందేనని తేల్చి చెప్పింది. భీమునిపట్నం సమీపంలో సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి నాలుగు రెక్టోబార్లు నిర్వహణ జరుగుతోందో లేదో నివేదిక ఇవ్వాలని ఎపి కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, జివిఎంసి కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్లతో కూడిన కమిటీకి ఉత్తర్వులు జారీ చేసింది. సర్వే చేసేటప్పుడు రెస్టోబార్ యజమానులను భాగస్వాములను చేయాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశాలను జారీ చేసింది. భీమునిపట్నం పరిధిలో పెనక నేహారెడ్డి శాశ్వతంగా కాంక్రీట్ నిర్మాణం చేయడాన్ని సవాలు చేస్తూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ పిల్ దాఖలు చేశారు. గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు కూడా మరో పిల్ వేశారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కెఎస్.మూర్తి వాదిస్తూ కాంక్రీట్ గోడను పాక్షికంగానే కూల్చారని చెప్పారు. అధికారులు సర్వేకు వచ్చినప్పుడు గోడను ఇసుకతో కప్పిపెట్టారని చెప్పారు. ప్రభుత్వ మిగతా 2లో..

'నాస్కామ్' కెరీర్ ఫెయిర్ ప్రారంభం

భారీగా తరలివచ్చిన యువత

ప్రజాశక్తి - మధురవాడ : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థలతో కలిసి నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా రెండు రోజులపాటు తలపెట్టిన కెరీర్ ఫెయిర్ బుధవారం ప్రారంభమైంది. పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చారు. తొలుత కెరీర్ ఫెయిర్‌ను విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ప్రారంభిస్తూ మాట్లాడారు. నైపుణ్యాలు లేకపోతే చేతిలో డిగ్రీ పట్టా ఉన్నా గౌరవప్రదమైన ఉద్యోగాలు సాధించడం కష్టమన్నారు. దేశంలోని ఇంజినీరింగ్ కళాశాలల నుంచి ఏటా లక్షలాది మంది యువత బయటకు వస్తున్నప్పటికీ సరైన నైపుణ్యాలు లేకపోవడంతో నిరుద్యోగులుగా మిగులుతున్నారని పేర్కొన్నారు. కెరీర్ ఫెయిర్‌ల ద్వారా యువత తాము ఏవిధమైన నైపుణ్యాలను పెంచుకోవాలో గ్రహించాలని, తద్వారా తమను తాము మెరుగు పరుచుకుని విజయం సాధించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఉపాధి కోసం యువత ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వలస వెళ్లకుండా స్థానికంగా ఉద్యోగాలు లభించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎమ్ఎన్.హరేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ తరహా కెరీర్ ఫెయిర్ నిర్వహణ రాష్ట్రంలో ఇదే ప్రథమమని అన్నారు. ఎయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిపి.రాజశేఖర్ మాట్లాడుతూ పరిశ్రమలకు, విద్యా సంస్థలకు మధ్య అంతరాన్ని నాస్కామ్ వంటి సంస్థలు తగ్గించాలన్నారు. నాస్కామ్ మిగతా 2లో..



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్



హాజరైన యువతీ యువకులు

మొదటి పేజీ తరువాయి..

గీతకు గాలం

316 దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఎక్సైజ్ శాఖకు మాంచి కిక్కు లభించినట్టయింది. దరఖాస్తుల ఆదాయం రూ.6 కోట్లా 32 లక్షలు వచ్చినట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఎఇఎస్) బి.ఈశ్వరరావు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ఇక్కడా వారే..

గతంలో షాపులు దక్కని వారు, ఇంకా మద్యం ద్వారా లభిస్తున్న ఆదాయంతో సంతృప్తి చెందని కొన్ని సంస్థల వారు ఈ వేలం పాటలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. రూ.లక్షలు చెల్లించే స్థోమత గీత కార్మికుల్లో అందరికీ ఉండకపోవడంతో నగరంలోని మద్యం షాపులపై పట్టు సాధించిన కొన్ని వ్యాపార సంస్థలు వారి దగ్గర పనిచేసే వారిలో గీత కార్మికులుంటే వారి పేర ఈ 14 షాపులను దక్కించుకోడానికి దరఖాస్తులు చేసుకున్నట్టు సమాచారం. మామూలుగా అయితే గ్రామీణ ప్రాంతంలో రూ.8 లక్షలు, నగరంలో రూ.12 లక్షలను దరఖాస్తు ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉంది. గీత కార్మికులకు పెద్ద ఎత్తున ప్రభుత్వం రాయితీ కల్పించడంతో రూ.2 లక్షలే దరఖాస్తు ఫీజు కట్టాలి. ఇదే అదునుగా బడా బాబులు వారి అనుకూల గీత కార్మికులతో సునాయాసంగా దరఖాస్తులు చేసేశారు. షాపులను వేలంలో దక్కించుకునే విషయంపై వారంతా ఇప్పుడు దృష్టిసారించారు. షాపులు దక్కించుకున్న తర్వాత లాభాల విషయంలో పాత పద్ధతే వర్తించనుంది. విశాఖ జిల్లాలో అధికారికంగా ఉండే 145 షాపులకు ఎలాగైతే సేల్స్‌లో 14 శాతం లాభం ఉంటుందో గీత కార్మికుల దరఖాస్తుల షాపులకూ అదే వర్తించనుంది.

నెలకు రూ.155 కోట్లు

నెలకు విశాఖపట్నంలో 145 మద్యం షాపుల ద్వారా ఎక్సైజ్ శాఖకు ఆదాయం రూ.155 కోట్లుగా ఉంది. ఈ ఏడాది జనవరిలో రూ.156 కోట్లు, ఫిబ్రవరిలో రూ.153 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి మద్యం ద్వారా లభించింది.

విజయసాయి కుమార్తెపై చర్యలు తీసుకోండి

ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి వాదిస్తూ కమిటీ సర్వే చేపట్టడానికి ముందే అధికారులు సర్వే చేసి సిఆర్‌జెడ్ రూల్స్ అమల్లోకి రాకముందు నిర్మించిన ఒక పాత భవనం, కొన్ని టాయిలెట్లు మినహా మిగిలిన వాటిని కూల్చేశారని చెప్పారు. అయితే భూమి పైన ఉన్న గోడ వరకు అధికారులు తొలగించారని చెప్పడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

'నాస్కామ్' కెరీర్ ఫెయిర్ ప్రారంభం

ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఉప్‌మిత్ సింగ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నైపుణ్యాలను యువతలో పెంచడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో గీతం విసి డాక్టర్ ఎరోలా డిసౌజా, ఉపాధ్యక్షులు ఎమ్.గంగాధరరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్ పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు జరిగే ఈ కెరీర్ ఫెయిర్‌లో పాల్గొనడానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 33,682 మంది యువత తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. బుధవారం ఉదయం నుంచే యువత పెద్ద ఎత్తున గీతం ప్రాంగణానికి తరలివచ్చారు. దాదాపు 50 కంపెనీల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూల నిర్వహణకు గీతంలోని వివిధ విభాగాలలో ఏర్పాట్లు చేశారు.

విశాఖలో సినీ తారల సందడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో ఎన్నో ఏళ్లుగా వస్త్ర వ్యాపార రంగంలో సేవలు అందిస్తున్న మెబాజ్ షోరూమ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రాండ్ వెడ్డింగ్ కలెక్షన్ 'యు ఆర్ ది అకేషన్' విభాగాన్ని సినీనటి రన్ రాజా రన్ , రాజుగారి గది - 2 ఫేం సీరత్ కపూర్, పొలిమేర ఫేం కామాక్షి భాస్కర్ల, బిగ్ బాస్ - 6 ఫేం అనిల్ రాథోడ్ బుధవారం సాయంత్రం ప్రాంభించారు. ఈ మేరకు సిరిపురం సమీపంలోని మెబాజ్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మెబాజ్ షోరూం వారు అద్భుతమైన నూతన వివాహ ఫ్యాషన్ వస్త్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. పురుషులు, స్త్రీలు, పిల్లలను ఆకర్షించే విధంగా బ్రైడల్ లెహంగాలు, రీగల్ షెర్వానీలు ఉన్నాయని అన్నారు. సంప్రదాయ హస్తకళతో రూపొందించిన వస్త్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో అనిల్ కపూర్, మెబాజ్ నిర్వాహకురాలు మెహక్ పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యాన..

నేడు మహిళా దినోత్సవ ర్యాలీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లాలో సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీలు చేపట్టనున్నారు. సాయంత్రం తగరపువలస, మధురవాడ, జివిఎంసి గాంధీ విగ్రహం, పెందుర్తి, గాజువాక ప్రాంతాలలో ఈ కార్యక్రమాలు ఉంటాయని ఆయా సంఘాల జిల్లా కమిటీలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ ప్రదర్శనల్లో పెద్ద ఎత్తున కార్మిక వర్గం పాల్గొనాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ పిలుపునిచ్చారు. మహిళల మీద రోజు రోజుకూ హింస, వేధింపులు పెరుగుతుండటంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు.

చిట్టిబాబు మృతికి సంతాపం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : లలిత సంగీతానికి జీవం పోసిన మహోన్నత వ్యక్తి బండారు చిట్టిబాబు మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటని ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు బుధవారం విడుదల చేసిన సంతాప ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. స్వతహాగా చిన్నతనంలోనే హార్మోనియం పట్టుకున్న బండారు ఆకాశవాణి ఎ - గ్రేడ్ కళాకారునిగా ఎంతో మందికి సంగీత జీవితాన్ని ప్రసాదించారన్నారు.

ఘనంగా ఇగ్నో స్నాతకోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 38వ స్నాతకోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. న్యూఢిల్లీలోని ఇగ్నో ప్రధాన కార్యాలయంలో భారత విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్య అతిథిగా జరిగిన ప్రధాన కార్యక్రమాన్ని ఆన్‌లైన్ విధానం ద్వారా దేశంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులు, ఉద్యోగులు వీక్షించారు. విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కేంద్రం పరిధిలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ప్రాంతీయ స్నాతకోత్సవ కార్యక్రమానికి శ్రీకాకుళంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య కె.రెమి రజని గౌరవ అతిథిగా విచ్చేసి స్నాతకోపన్యాసం చేసి విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందించారు. ఆచార్య రజని తన ఉపన్యాసంలో దూరవిద్య ద్వారా ఉత్తమ విద్యనందించేందుకు అవసరమయిన అన్ని వనరులూ ఉన్న విశ్వ విద్యాలయం ఇగ్నో అని, ఇగ్నో కోర్సులలో ఇమిడి ఉన్న ప్రత్యేక లక్షణాలు విద్యార్థులను సమాజానికి అవసరమైన వ్యక్తులుగా మారుస్తాయని అన్నారు. విద్యార్థులు తమ డిగ్రీలను కేవలం సర్టిఫికెట్‌లుగా కాకుండా వాటిని ఒక బాధ్యతగా తీసుకుని ఆ డిగ్రీల ద్వారా ఇగ్నో అందించిన విలువలు, క్రమశిక్షణ వంటి లక్షణాలను తమ దైనందిన జీవితంలో పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇగ్నో ప్రాంతీయ కేంద్ర సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు వార్షిక నివేదికను తెలియజేశారు. కార్యక్రమంలో ఇగ్నో ఉప సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు, పూర్వ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ ఎస్.రాజారావు, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, ఇగ్నో అధ్యయన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ శిరీష, సహ సమన్వయకర్తలు, ఇగ్నో ఉద్యోగులు పాల్గొన్నారు.



పట్టాలు అందుకున్న వారితో అతిథులు

పూర్ణా మార్కెట్‌లో..

చిరు వ్యాపారులను తొలగించొద్దు



ధర్నా చేస్తున్న చిరువ్యాపారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సర్దార్ వల్లభాయ్ పటేల్ పూర్ణా మార్కెట్‌లో చిరు వ్యాపారులను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర ఉన్న పూర్ణా మార్కెట్‌లో 30 సంవత్సరాలు పైబడి చిరు వ్యాపారం చేసుకుంటున్న చిల్లర వర్తకులను అన్యాయంగా తొలగించడం దుర్మార్గమన్నారు. స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్, పోలీస్ కమిషనర్, మేయర్, మున్సిపల్ జోనల్ కమిషనర్ మొదలుకొని ఎంతమంది అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించు కోకపోవడం తగదన్నారు. 'మాది మంచి ప్రభుత్వం' అని చెప్పుకునే కూటమి సర్కారు సిగ్గుపడాల్సిన విషయమన్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని దళితులు, బిసిల బతుకులను రోడ్డుపాలు చేశారని, వారు తెచ్చుకున్న కాయగూరలు, పండ్లు, పూలను కొద్ది రోజుల క్రితం దౌర్జన్యంగా అధికారులు జీపుల్లో ఎక్కించుకొని వెళ్లిపోయారని చెప్పారు. 26 రోజులుగా ఆ పేదలంతా తిండి లేక పస్తులు ఉంటున్నారన్నారు. స్థానిక సిఐ జిడి.బాబు అధికారుల ఉత్తర్వులు ఉన్నాయంటూ అన్యాయంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని చిరు వ్యాపారస్తులకు పూర్ణా మార్కెట్‌లో యథావిధిగా వ్యాపారం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.

లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిరువర్తకులు సత్య, శ్రీను, రూప, పి.వెంకటేష్, కె.మల్లేష్, రాము, వరాలు, దుర్గ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆటో డ్రైవర్లకు ప్రమాదకరంగా ఉన్న జిఒ 21, 31లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని, ఆటో డ్రైవర్లకు, మోటారు కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు బిసిహెచ్.మసేన్ వారినుద్దేశించి మాట్లాడారు. ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె.రహిమాన్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు పాల్గొన్నారు.

జిఒలపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పురపాలక మంత్రిత్వ శాఖ ఇటీవల జారీ చేసిన జిఒలు 3, 4, 5, 20లపై సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ థియేటర్‌లో డిటిసిపి అధికారులు ఎల్‌టిపిఎస్‌లకు, ఇంజినీర్లుకు, ప్లానింగ్ సెక్రటరీలకు బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డిటిసిపిఒ నాయుడు, ప్లానింగ్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దారపాలెంలో దర్జాగా కబ్జాలు

- రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములకు ఎసరు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం



దారపాలెంలోని ప్రభుత్వ స్థలంలో చేపట్టిన నిర్మాణాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఎక్కడ కనిపిస్తే అక్కడకు కబ్జాదారులు గెద్దల్లా వాలిపోవడం, సర్వే నెంబర్లు మార్చేసి నకిలీ పత్రాలు సృష్టించి వేరే ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం జివిఎంసి 13వ వార్డు పరిధి బిఆర్‌టిఎస్ రహదారిని ఆనుకొని ఉన్న దారపాలెం పరిసర ప్రాంతాల్లో నిత్యకృత్యంగా మారాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తూ కబ్జాదారులకు సహకరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా సర్వే నెంబరు 15/2 లో రెవెన్యూ కొండ పోరంబోకు భూమి ఉంది. ఈ భూమిలో ఇప్పటికే కొంత మంది స్థలాలను ఆక్రమించి ఆవాసాలు నిర్మించేశారు. దేవస్థానం కొండను ఆనుకొని ఉన్న హెచ్‌టివి విద్యుత్ లైన్ దిగువన కూడా పలు స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. తాజాగా ఇక్కడ కొందరు వ్యక్తులు సుమారు 700 గజాల స్థలం ఆక్రమించారు. ఈ స్థలాన్ని ఐదు ప్లాట్లుగా విభజించి కొందరికి విక్రయించారు. ఆయా స్థలాల్లో ఐదు రోజుల క్రితం రాత్రిపూట బోర్లు తవ్వించి నిర్మాణ పనులు ప్రారంభించారు. వాటికి విద్యుత్ విభాగం అధికారులు విద్యుత్ మీటర్ కూడా మంజూరు చేసేశారు. ఆ మీటర్‌ను ఖాళీ స్థలంలో కర్రలకు అమర్చేసి అందుబాటులో ఉన్న విద్యుత్ స్థంబానికి కనక్షన్ ఇచ్చేశారు. ఈ విషయం తెలుసుకున్న చినగదిలి రూరల్ మండల అధికారులు మూడు రోజుల క్రితం ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలం కొండ పోరంబోకులో ఉన్నట్టు గుర్తించి వెంటనే పనులను నిలిపివేయించారు. స్థలం పత్రాలు ఉంటే చూపించాలని అడిగారు. సరైన పత్రాలు చూపించకలేక కబ్జాదారులు అక్కడి నుంచి జారుకున్నట్టు సమాచారం. రెవెన్యూకు సంబంధించిన ఖాళీ స్థలాలు ఎక్కడ ఉన్నాయో ఆ శాఖ కిందిస్థాయి ఉద్యోగులే కబ్జాదారులకు లీకులిచ్చి ఆక్రమణకు సహకరిస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ఈ ప్రాంతంలో చాలా వరకు ఇదే తరహాలో ఆక్రమణలకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో ఎంతో విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా రక్షణ గోడలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

కేంద్ర కారాగారంలో ఖైదీలకు ఇంటర్మీడియట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జైలు సూపరిండెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి పదిమంది ఖైదీలు రెగ్యులర్‌గా, మరో ఐదుగురు సప్లమెంటరీ పరీక్షలు రాస్తున్నారని పేర్కొన్నారు. వీరిలో 4గురు ఖైదీలు రాజమండ్రి జైలుకు ట్రాన్స్‌ఫర్ కాగా మిగిలిన 11 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. వీరికి జైలు ప్రాంగణంలో ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటుచేసి ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ సమక్షంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

దివీస్‌లో భద్రతా మాసోత్సవాలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్‌లో బుధవారం 54వ జాతీయ భద్రతా మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాథుర్ హాజరై మాట్లాడుతూ, పని ప్రదేశంలో నిత్యమూ అప్రమత్తంగా ఉండాలని ఉద్యోగులు, కార్మికులకు సూచించారు. భద్రతా పరంగా అవగాహన పెంచుకోవాలని స్పష్టం చేశారు. దివీస్ సంస్థ సేఫ్టీ అధికారి ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ, భద్రతా దినోత్సవం సందర్భంగా ఉద్యోగులకు, కార్మికులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివీస్ డైరెక్టర్ ఎస్.దేవేందర్ రావు, జిఎంవైఎస్ కోటేశ్వరరావు, ఇహెచ్‌ఎస్ జిఎం కె.సుబ్బారావు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి'

ప్రజాశక్తి -భీమునిపట్నం : మత్స్యకారుల సమస్యలను ప్రస్తావించేందుకు శాసన మండలిలో తమ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మత్స్యకార నాయకులు గంటా నూకరాజు విజ్ఞప్తి చేశారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, మత్స్యకారులు అనేక సమస్యలతో సతమత మవుతున్నారని, ఎమ్మెల్సీగా అవకాశముంటే సమస్యలపై చర్చించేందుకు అవకాశం ఉంటుందన్నారు. జివిఎంసి మహాత్మా గాంధీ ఫిషర్ మెన్ ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్‌గా మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు.

భోగాపురం- విశాఖ మధ్య

సమాంతర పనులు చేపట్టకపోతే ఇబ్బందులు

భీమిలి ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -మధురవాడ : భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వచ్చే నాటికి రోడ్లు, ఫ్లైఓవర్లు తదితర మౌలిక సౌకర్యాలను సమాంతరంగా అందుబాటులోకి తీసుకురావాలని, లేకుంటే ఇబ్బందులు తప్పవని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, పీక్ అవర్స్‌లో హనుమంతవాక జంక్షన్, మధురవాడ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనుకున్న సమయానికంటే ముందుగానే భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తికానున్న నేపథ్యంలో 15 ఫ్లైఓవర్లు, రోడ్ల విస్తరణ, కనెక్టింగ్ రోడ్లు, బీచ్ వెంబడి ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. విశాఖకు అత్యావశ్యకమైన మెట్రోకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. మెట్రోతో పాటు రోడ్లు, ఫ్లైఓవర్ల ప్రతిపాదనలకు అవసరమైన భూసేకరణ ఎప్పుడు మొదలు పెట్టి, ఎప్పటికి పూర్తి చేస్తారన్న అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేయాలని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణను కోరారు.

ఎఫోర్ట్ సదస్సుకు డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ కథనాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఫ్రాన్స్‌లోని లియోన్‌లో ఈ ఏడాది జూన్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక యూరోపియన్ ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ ఆర్థోపెడిక్ అసోసియేషన్స్ ఇన్ ఆర్థోపెడిక్స్ అండ్ ట్రామాలజీ (ఎఫోర్ట్) వార్షిక సదస్సులో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, ప్రొఫెసర్ అండ్ హెచ్‌ఒడి డాక్టర్ అబ్దుల్ డీ ఖాన్ సమర్పించిన మూడు సైంటిఫిక్ రీసెర్చ్ ఆర్టికల్స్ ఆమోదించబడ్డాయి. యూరోపియన్ వార్షిక సదస్సులో మూడు పేపర్లు మౌఖిక ప్రదర్శన కోసం ఆమోదించడం ఇక్కడ పనిచేస్తున్న వ్యక్తికి దక్కిన అరుదైన గౌరవం. ఈ మేరకు ఎఫోర్ట్ కాన్ఫరెన్స్ కమిటీ డాక్టర్ ఖాన్‌కు లేఖ పంపించింది. మోకాలి, తుంటి ఆస్టియో ఆర్థరైటిస్ ప్రారంభ దశలకు పిఆర్‌పి (ప్లేట్ రిచ్ ప్లాస్మా), హైలురోనిక్ యాసిడ్ ఇంజక్షన్ల రెండు సంవత్సరాల ఫాలో అప్ ఫంక్షనల్ ఫలితాలు ఉన్నాయి.

ఓక్రిడ్జిలో టీచింగ్, లెర్నింగ్ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ఓక్రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్లో బుధవారం నుంచి మూడు రోజుల పాటు సౌత్ ఈస్ట్ ఏషియా, మిడిల్ ఈస్ట్ ఇండియా టీచింగ్ అండ్ లెర్నింగ్ కాన్ఫరెన్స్- 2025 నిర్వహించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నార్త్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ స్కూల్స్‌కు చెందిన 200 మందికిపైగా ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, సమాఖ్య, భవిష్యత్తులో బోధనా పద్ధతులు తదితర అంశాలపై లోతుగా చర్చించినట్లు ప్రిన్సిపల్ శైలా భమిడిపాటి తెలిపారు. కృత్రిమ మేధస్సును ఎలా వినియోగించాలి, న్యూరో డైవర్శిటీ, మెటా కాగ్నిషన్ తదితర అంశాలపై చర్చించారు.

అలేఖ్యకు ముత్తంశెట్టి అభినందనలు

ప్రజాశక్తి- తగరపువలస : ఆంధ్రా యూనివర్సిటీ ఇటీవల విడుదల చేసిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ ఫలితాల్లో 9.83 మార్కులతో టాపర్‌గా నిలిచిన అవంతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని అలేఖ్యను విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు కళాశాలలో బుధవారం అభినందించారు. జ్ఞాపిక అందజేశారు. కళాశాల డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ప్రిన్సిపల్ పిన్నింటి రామకృష్ణ, అధ్యాపకులు నాగరాజు, శ్రీనివాసరావు, రాధిక తదితరులు పాల్గొన్నారు



అలేఖ్యను అభినందిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

నేరాలు ఘోరాలు



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రైల్వే న్యూ కాలనీ రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. కంచరపాలెం పరిధి ధర్మానగర్, వాడపేటలో అమ్మవారి పండగ నేపథ్యంలో తిక్కవానిపాలేనికి చెందిన గోపి (20), అచ్చిరాజు (20) సాయంత్రం పరసలో పాల్గొన్నారు. తర్వాత వారిద్దరూ బైక్‌పై అక్కడ నుండి నగరంలోకి వెళ్లారు. తిరిగి అర్ధరాత్రి దాటాక రైల్వే స్టేషన్ వైపు నుంచి కంచరపాలెం వైపు వెళుతుండగా అతివేగంతో చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. రైల్వే న్యూ కాలనీ సాయిబాబా గుడి ఎదురుగా ప్రమాదం చోటు చేసుకోంది. సమాచారం అందుకున్న కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు. అప్పటి వరకు పండగలో సరదాగా గడిపిన యువకులు మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలతో విషాదఛాయలు అలుముకున్నాయి. ట్రాఫిక్ సిఐ దాశరధి నేతృత్వంలో కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : చెట్టుకు ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం కంచరపాలెం పరిధిలో చోటు చేసుకుంది. కంచరపాలెం ఎస్ఐ సమీర్ కథనం ప్రకారం... కంచరపాలెం గాంధీనగర్ ప్రాంతానికి చెందిన బత్తిన భానుప్రకాష్ (20) బుధవారం వేకువ జామున సుమారు 6 గంటల ప్రాంతంలో ఇంటి వెనక ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన బంధువులు కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకొని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. మృతుని తండ్రి బత్తిన పైడిరాజు (47), తల్లి కొండమ్మ (45), సోదరుడు ఆనంద్ (22) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మృతుడు ఇటీవల చెడు వ్యసనాలకు బానిసయ్యాడని స్థానికులు చెబుతున్నారు. సిఐ రవికుమార్ నేతృత్వంలో కంచరపాలెం ఎస్ఐ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో గల శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం హుండీలో ఉన్న సుమారు రూ.35000 నగదు, ఇటీవల మహాశివరాత్రిని పురస్కరించుకొని, స్వామివారి కల్యాణోత్సవాలు జరిపినప్పుడు అలంకరించిన తులం బంగారం, పది తులాల వెండి కనిపించడం లేదంటూ ఆలయ కమిటీ సభ్యులు తగరంపూడి నాగేశ్వరరావు, ఏ.సత్యనారాయణ, జి.ధనాజీ దేవరాపల్లి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే ఆలయంలో రెండుసార్లు దొంగతనం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో పొందూరు, వరహానది సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం రెవెన్యూ అధికారులు పట్టుకుని స్టేషనుకు తరలించారు, మాకవరపాలెం మండలం జంగాలపల్లి వద్ద సర్పనదిని ఆనుకొని ఉన్న జిరాయితి భూముల్లో అనుమతి లేకుండా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు, అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ దామోదర నాయుడు హెచ్చరించారు.

వ్యాధులపై ఆర్‌ఎంపిలకు అవగాహన

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం గ్రామంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం ఉదయం మండల గ్రామీణ వైద్యులకు గ్యాస్ట్రిక్, కేన్సర్ వ్యాధులపై విజయనగరంలోని మహేంద్రా హాస్పిటల్ అధినేత డాక్టర్ మహేంద్రగిరి, డ్యూటీ డాక్టర్ జయశంకర్‌కృష్ణ అవగాహన కల్పించారు. కడుపు నొప్పి, చిన్నప్రేగు ఒరుపు తదితరాలపై వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు కల్పించారు. ఈ అవగాహన సదస్సులో గెద్ద చిరంజీవి, మండల గ్రామీణ వైద్యుల అధ్యక్షులు ఆర్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి -గాజువాక : ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలని, అప్పుడే సమాజం ప్రగతి వైపు పరుగులు తీస్తుందని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. గాజువాక ఆటోనగర్ గ్రీన్ సిటీ సమావేశ మందిరంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన మెగా ఎంఎస్ఎంఇ అవుట్ రీచ్ క్యాంపును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ, మహిళలు స్వయంశక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు ప్రయత్నాలు చేయాలని సూచించారు. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. మహిళలు ఆర్థికంగా రాణించేందుకు కావాల్సిన సహకారాన్ని ప్రభుత్వాలు అందించేందుకు సిద్ధమవుతున్నాయని చెప్పారు. రుణాల మంజూరు విషయంలో యూనియన్ బ్యాంక్ తీసుకుంటున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ (ముంబై) బిజూ వాసుదేవన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు బ్యాంక్ నుంచి ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో విశాఖలో నారీశక్తి బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలతో ఆర్థికాభివృద్ధి చెంది సకాలంలో తిరిగి రుణాలను చెల్లించాలని సూచించారు. అనంతరం పలువురు మహిళలకు కొత్తగా రుణాలకు సంబంధించి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్లు షాలిని మీనన్, వి.ఆదిశేషులు, రీజినల్ హెడ్ ఆర్.నరసింహకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆపకపోతే సమ్మె

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియ ఆపకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని ఉక్కు కాంట్రాక్టు కార్మికుల ఉపాధ్యక్షుడు వి.వి.రమణ తెలిపారు. ఉక్కునగరం సిఐటియు కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో కాంట్రాక్టు కార్మికులను తొలగించే పనికి ఉక్కు యాజమాన్యం పూనుకుందని విమర్శించారు. మరోవైపు గేట్ పాసులు పద్ధతి మారుస్తూ చేసిన నిర్ణయం కార్మికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తుందన్నారు. కాంట్రాక్టు కార్మికులను తగ్గించాలని కాంట్రాక్టర్లకు జారీచేసిన నోటీసులు వెంటనే విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. లేకుంటే ఏ క్షణానైనా సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ నెల 25వ తేదీన ఆర్ఎల్‌సి సమక్షంలో చర్చలు జరిగాయని, చర్చల్లో యాజమాన్యం చెప్పిందొకటి, స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతోందని మరొకటి అని తెలిపారు. కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికులను తగ్గించి ఉన్న కార్మికులపై భారం పెంచి తక్కువ మందితో ఎక్కువ ఉత్పత్తి తీయించి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని కుట్ర దీనిలో దాగి ఉందన్నారు. వాస్తవ పరిస్థితిని విస్మరించి యాజమాన్యం కేంద్రం ఆదేశాలకు తలొగ్గితే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు.

జివిఎంసి ఆసుపత్రిలో మందుల కొరత

ప్రజాశక్తి-ములగాడ : పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని గుల్లలపాలెం ప్రాథమిక వైద్య సేవ ఆసుపత్రిలో వైద్యులు, మందులు కొరత వేధిస్తోంది. కనీసం సూదులు కూడా లేకపోవడంతో చాలామంది రోగులు రెండు నెలల నుంచి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పారిశ్రామిక ప్రాంత సంఘ సేవకులు పెద్దిరెడ్డి నానాజీ దృష్టికి రోగులు తీసుకెళ్లారు. దీనికి ఆయన స్పందించి ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యేతో పాటు జివిఎంసి అధికారులకు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అతి త్వరలోనే ఆసుపత్రిలో రోగులకు మందులు, సౌకర్యాలు లభించేలా కృషి చేస్తానని నానాజీ హామీఇచ్చారు.


పూడికతీత పనులను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ రాము

చురుగ్గా పూడికతీత పనులు

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : జివిఎంసి 65వ వార్డులోని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించే పనిని చేపట్టారు. వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు పనులను పర్యవేక్షించారు. కాలువల్లో పూడిక పేరుకుపోవడం వల్ల మురుగు నీరు పోయేందుకు ఇబ్బందిగా ఉందని, పైగా పారిశు ధ్య పనులు చేసే కార్మికులకు కష్టంగా ఉంటుందని కార్పొరేటర్ తెలిపారు. కాలువల్లో చెత్త వేయొద్దని ప్రజలకు సూచించారు. వార్డులో పెండింగ్ పనులన్నింటినీ దశలవారీగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఇళ్లల్లోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కోరారు.

పూడికతీత పనుల పరిశీలన

మాధవధార : జివిఎంసి 50వ వార్డులో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము బుధవారం పర్యటించారు.వివిధ ప్రాంతాల్లో గెడ్డ పూడికతీత పనులను పరిశీలించారు. పూడికతీతలను రోడ్డుపై ప్రజలకు ఇబ్బందులు లేకుండా వేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఇంటింటి నుండి చెత్త సేకరణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.సుధాకర్, సూపర్‌వైజర్ చిరంజీవి, వార్డు టిడిపి అధ్యక్షులు సనపల వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధి చిట్టివలసకు చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త ఎ.శ్రీనివాసరావును పార్టీ జిల్లా కార్యదర్శి పిట్ట సురేష్ బుధవారం పరామర్శించారు. ఇటీవలనే అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం శ్రీనివాసరావు ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సురేష్ అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు బి.ప్రకాష్, ఎ.రవి తదితరులున్నారు.

ఎన్ఎస్‌టిఎల్‌లో నేషనల్ సైన్స్ డే వేడుకలు



సైన్స్ డే వేడుకల్లో పాల్గొన్న అతిథులు, ఎన్ఎస్‌టిఎల్ ప్రతినిధులు

ప్రజాశక్తి- కరాస: విశాఖపట్నంలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) ప్రధాన నావికా పరిశోధన ప్రయోగశాల అయిన నేవల్ సైన్స్ టెక్నలాజికల్ లేబొరేటరీ (ఎన్ఎస్‌టిఎల్)లో మోహపాత్ర మానసి ఆడిటోరియంలో జాతీయ సైన్స్ డే వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డిఆర్‌డిఒ మాజీ చైర్మన్ డాక్టర్ అవినాష్ చందర్ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయంలో సైన్స్ స్ఫూర్తిని ఆయన వివరించారు. ప్రాచీన భారతీయ శాస్త్రవేత్తలు చరక, సుశ్రుత, వరాహ మిహిర, ఆర్యభట్ట తదితరులతోపాటు నేటి తరం శాస్త్రవేత్తలను, ప్రాచీన రోజుల నుండి సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధిలో భారతదేశం సామర్థ్యాన్ని సూచించే వారి విలువైన సహకారాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందిన టాప్-25 సంస్థలకు భారతీయులు మాత్రమే నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. భారతీయ ప్రొఫెసర్లు ప్రపంచంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలకు వెన్నెముక అని పేర్కొన్నారు. 1,40,000 కంటే ఎక్కువ స్టార్టప్‌లు భారతదేశాన్ని ప్రతి రంగంలో బలోపేతం చేస్తున్నాయని వివరించారు.

2025 జాతీయ సైన్స్ డే "వికసిత్ భారత్ కోసం సైన్స్, ఇన్నోవేషన్‌లో గ్లోబల్ లీడర్‌షిప్ కోసం భారతీయ యువతకు సాధికారత" థీమ్‌ను ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ వివరించారు. సైన్స్, ఇన్నోవేషన్‌లో భారతదేశాన్ని గ్లోబల్ లీడర్‌గా మార్చడానికి యువకుల స్థిరమైన ప్రయత్నాల ఆవశ్యకతను ఆయన చెప్పారు. అనంతరం ముఖ్య అతిథి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఎనేబుల్డ్ డేటాబేస్ "జ్ఞానకోష్"ని ప్రారంభించారు, ఇది అన్ని హైడ్రోడైనమిక్ మోడల్ టెస్ట్ డేటాకు నాలెడ్జ్ రిపోజిటరీగా ఉంటుంది. సముద్ర వాహనాలు. ఈ డేటాబేస్‌ను స్టార్ట్-అప్ ట్రిడాల్‌తో కలిసి అభివృద్ధి చేసింది. ఈ కార్యక్రమంలో రమేష్‌బాబు బోణి, అసోసియేట్ డైరెక్టర్లు హెచ్.ఎన్.దాస్, రాజేశ్వరిదేవి, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ జివి.కృష్ణకుమార్, డాక్టర్ ఎస్‌కె.పాణిగ్రాహి, సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎ.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భెల్‌లో జాయినింగ్ తేదీలు సరిచేయాలి

ప్రజాశక్తి -గాజువాక : బిహెచ్ఇఎల్ ఉద్యోగులకు జాయినింగ్ తేదీలు సరిచేసిన తర్వాతే పెన్షన్ చెల్లించాలని టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు అల్లి అప్పలనారాయణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. భెల్ ఉద్యోగులు తమ పెన్షన్‌కు సంబంధించి జాయినింగ్ తేదీలను సరి చేయాలంటూ గత నెల 6న గుర్తింపు యూనియన్ కార్యాలయానికి వెళ్లిన సందర్భంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ, 15 రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ లేదన్నారు. ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పెన్షన్ తేదీలు సరిగా లేనందున విరమణ పొందిన ఉద్యోగులతో పాటు పెన్షన్‌కు అర్హులైనవారు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని తెలిపారు. గుర్తింపు యూనియన్ నాయకులతో పాటు యాజమాన్యం కూడా ఈ విషయంలో తక్షణమే స్పందించి, న్యాయం చేయాలని కోరారు.

మహిళా హక్కులను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : అనేక ఉద్యమాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న మహిళా హక్కులను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పిఒడబ్ల్యు రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మి అన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం సందర్భంగా ప్రగతి శీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) ఆధ్వర్యాన బుధవారం పౌర గ్రంథాలయంలో మహిళలతో సదస్సు జరిగింది. సదస్సులో ఆమె మాట్లాడుతూ, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి ప్రతి మహిళా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మనువాదాన్ని తీసుకొచ్చి మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాయడానికి కుట్ర పన్నిందన్నారు. కాబట్టి మహిళలంతా మేధావులు, అభ్యుదయ వాదులతో కలిసి హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ, అన్ని రంగాల్లో మహిళలు వివక్షతకు గురవుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పక్కనపెట్టి, కాషాయంతో సమాజాన్ని ఫాసిస్ట్ దేశంగా చేయడానికి బిజెపి కుట్ర పన్నిందన్నారు. అంబేద్కర్, జ్యోతిరావు పూలే సాధించిన హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటలక్ష్మి అధ్యక్షత జరిగిన సదస్సులో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఇందిర, జిల్లా ఉపాధ్యక్షులు బాలనాగమ్మ, భారత నాస్తిక సమాజం జిల్లా కార్యదర్శి వై.నూకరాజు, రాజకీయ ఖైదీ విడుదల కమిటీ ప్రతినిధి పద్మ, చైతన్య మహిళా సమాఖ్య సభ్యులు లలిత, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం నాయకులు రవి పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న పిఒడబ్ల్యు రాష్ట్ర నాయకులు లక్ష్మి

ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-ములగాడ : పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలాన్ని, సొంతంగా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలను ఎన్‌డిఎ ప్రభుత్వం ఇవ్వాలని సిపిఐ నాయకులు డిమాండ్‌చేశారు. సిపిఐ ఆధ్వర్యాన మల్కాపురం గ్రామ మండలి కార్యాలయంలో ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు గుడాల రాంబాబు మాట్లాడుతూ, ఇళ్ల కోసం దరఖాస్తు చేసిన వారంతా ఈ నెల 10వ తేదీన ములగాడ తహశీల్దార్ కార్యాలయానికి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సూరిబాబు, కనకరాజు, కామేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -గాజువాక : టిడ్కో లబ్ధిదారుల సమస్యలపై సిపిఐ ఆధ్వర్యాన ఎపిడిఒ గంగాధర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు సొమ్ము చెల్లించి నప్పటికీ ఇంత వరకు గృహాలను కేటాయించలేదని తెలిపారు. 60 ఏళ్ల నిండిన లబ్ధిదారులకు బ్యాంక్ రుణం ఇవ్వడం లేదని, వారికి వెసులుబాటు కల్పించాలని కోరారు. లబ్ధిదారులకు సంబంధించిన ముఖ్య పత్రాలు అర్‌పిల వద్ద ఉన్నాయని, వాటిని లబ్ధిదారులకు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడ్కో లబ్ధిదారుల సంఘం నాయకులు పి.అప్పలరాజు, భాస్కరరావు, నాగేశ్వరరావు, రహిమా, రోహిణి పాల్గొన్నారు.

న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి- పెందుర్తి : పాత పెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.కిరణ్మయి అధ్యక్షతన న్యాయ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా సివిల్ జడ్జి వెంకట శేషమ్మ హాజరై పోక్సో చట్టంపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల లోపు బాలబాలికలను శారీరకంగా, మానసికంగా హింసకు గురి చేసేవాళ్లపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. పిల్లలను చిన్న తనం నుంచి మంచి మార్గంలో నడిపించే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉంటుందని తెలిపారు. పిల్లల చదువు పట్ల తల్లిదండ్రుల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో సిడిపిఒ నీలవేణి, డాక్టర్ ఖాలేష్ బేగం, కెవి.లక్ష్మి, ఎస్ఐ దేముడునాయుడు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీపిక, అప్పలరాజు, మమత, సువేఖ, పాఠశాల ఉపాధ్యాయులు సి హెచ్.జగదీష్, శ్రీనివాసు, మాధురి, కిరణ్‌కుమార్, అనురాధ, ప్రకాశ్, జాలమ్మ, స్కూల్ కమిటీ చైర్మన్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని గ్రావెల్ దందా

- పైడివాడ అగ్రహారం హౌసింగ్ లేఅవుట్ నుండి యథేచ్ఛగా మట్టి తరలింపు
- 200 ప్లాట్ల సరిహద్దులు మాయం
- తవ్వకాలకు అనుమతుల్లేవన్న మైన్స్ ఎడి



పైడివాడ అగ్రహారం హౌసింగ్ లే అవుట్ వద్ద తవ్వకాలు సాగిన దృశ్యం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ లే అవుట్ (గతంలో జగనన్న అర్బన్ హౌసింగ్ లే అవుట్)లో కొండకు అనుకొని ఉన్న ప్లాట్ల నుండి గ్రావెల్ అక్రమ తవ్వకాలు బుధవారం కూడా యథావిధిగా కొనసాగాయి. ఈ లేఅవుట్ కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన ఆర్‌సి ప్లాట్లు అభివృద్ధికి గ్రావెల్ కోసం వియంఆర్‌డిఎ అధికారుల విజ్ఞప్తి మేరకు గ్రావెల్ అనుమతుల కోసం స్థానిక తహశీల్దార్ బి.చిన్నికృష్ణ మైనింగ్ అధికారులకు అనుమతుల కోసం లేఖ రాశారు. ఆ లేఖను గ్రామానికి చెందిన నాయకులు పట్టుకొని తమకు అనుమతులు ఇచ్చారంటూ అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. దీనిపై సబ్బవరం పాత్రికేయులు మంగళవారం వెళ్లి ఆరా తీయగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తహశీల్దారు స్పష్టం చేసిన విషయం విధితమే. అయినా కూడా బుధవారం పైడివాడ అగ్రహారం లేఅవుట్ నుండి గ్రావెల్ తవ్వకాలు, తరలింపు ఆగలేదు. గ్రావెల్ మాఫియా తగ్గేది లేదంటూ రెచ్చిపోతోంది. ఇక్కడ కొండకు ఆనుకొని ఉన్న ప్లాట్లలో గ్రావెల్ తవ్వకాలు చేయడంతో ఈ లే అవుట్‌లో సుమారు 200 ప్లాట్లు సరిహద్దులు మాయమయ్యాయి. రెవెన్యూ అధికారులు, వియంఆర్డీఏ అధికారులు గ్రావెల్ మాఫియాకు కొమ్ముకాస్తూ ఈ దందా కొనసాగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మరో వైపు పైడివాడ అగ్రహారం గ్రామంలో భూములు పోయిన రైతులకు ఇచ్చిన ఆర్‌సి ప్లాట్లు అభివృద్ధి చేయకుండా ఇక్కడి తవ్వకాలు చేసిన గ్రావెల్‌ను నంగినారపాడు, గొల్లలపాలెం, గాలి భీమవరం, అజనగిరి గ్రామాల్లో గల లే అవుట్లకు తరలించడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అయినప్పటికీ గ్రావెల్ దందాదారులు అక్రమ తవ్వకాలు, గ్రావెల్ రవాణా నిలుపుదల చేయకుండా కొనసాగిస్తున్నారు.

దీంతో అనకాపల్లి జిల్లా మైన్స్ ఎడి శ్రీనివాస్‌ను బుధవారం విలేకరులు ఫోన్లో సంప్రదించారు. దీనికి స్పందించిన ఆయన తాము గ్రావెల్ తవ్వకానికి గాని, రవాణాకు గాని ఎటువంటి అనుమతులు ఎవరికీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. అయితే సబ్బవరం తహశీల్దారు అనుమతులు కోరుతూ లేఖ రాశారే తప్ప, ఫలానా సర్వే నెంబర్, ఫలానా కొండ, ఫలానా స్థలం, రెవిన్యూ సర్వే నెంబర్లు వంటి వివరాలతో తమకు దరఖాస్తు చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు, మైనింగ్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



విధుల్లో చేరిన ప్రమీలా దేవి

పట్టుదలతో లక్ష్యాన్ని ఛేదించిన వివాహిత

- ఎస్ఐగా విధుల్లో చేరిన ప్రమీలా దేవి

ప్రజాశక్తి-వడ్డాది : వివాహమైనప్పటికీ ఎస్ఐ కావాలన్న పట్టుదల, ఆత్మవిశ్వాసంతో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకొని ఎస్సైగా విధుల్లో చేరారు వడ్డాదికి చెందిన ప్రమీలాదేవి. విజయనగరం జిల్లాకు చెందిన కొండపల్లి ప్రమీలా దేవికి వడ్డాది వ్యక్తితో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. చిన్నప్పటి నుండి ఎస్సై కావాలన్నది ప్రమీల కల. వివాహమై పిల్లలు ఉన్నప్పటికీ తన తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతో తన లక్ష్యాన్ని చేరుకునేందుకు అహర్నిశలు కష్టపడింది. ఏడాది క్రితం జరిగిన ఈవెంట్స్, పరీక్షలలో ఎస్సైగా సెలెక్ట్ అయింది. తదుపరి అనంతపురం జిల్లాలో 52 వారాల పాటు ఎస్సైగా శిక్షణ పూర్తి చేసుకుని ప్రొబేషనరీ ఎస్సైగా శ్రీకాకుళం జిల్లాలో విధుల్లో చేరింది. తను అనుకున్న లక్ష్యాన్ని చేరడంతో ప్రమీలా దేవి ఆనందానికి అవధులు లేవు.

కాండ్రేగుల అప్పారావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కాండ్రేగుల అప్పారావు 85వ జన్మదిన వేడుకలు స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో బుధవారం జరిగాయి. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని అప్పారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మల్ల సురేంద్ర మాట్లాడుతూ కెప్టెన్ అప్పారావు వయోవృద్ధుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డేడ అప్పారావు, ఎన్ఎఫ్ఐ సత్యనారాయణ, గోపాలరావు, పిల్ల నిర్మల, బుద్ద తాతారావు, విల్లూరి రాము, పడాల అప్పారావు, కొణతాల శ్రీనివాసరావు, పెతకంశెట్టి జగన్ మోహన్, కాండ్రేగుల విస్సు, ఎంఎస్ఎన్ అప్పారావు, బుద్ద భూలోకనాయుడు, సరిసా భాస్కర్, కర్రి జగ్గ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షను విడనాడాలి

ప్రజాశక్తి-యలమంచిలి : ప్రతి ఒక్కరూ లింగ వివక్షను వీడాలని టౌన్ ఎస్ఐ సావిత్రి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం యలమంచిలి స్టేషన్ రోడ్డులోని కెబిఆర్ కాలేజీలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆమె మాట్లాడుతూ పూర్వపు రోజుల్లో వంటింటికే అంకితమైన స్త్రీలు ఇప్పుడు కార్లు, రైళ్లు, విమానాలు, హెలికాప్టర్లు నడిపే స్థాయిలో, మగవారితో పోటీపడుతూ ముందంజలో ఉన్నారని తెలిపారు. ఆడపిల్ల పుడితే తక్కువని డీలాపడ్డం, మగపిల్లాడైతే వంశోద్ధారకుడని ఉప్పొంగిపోవడం అనే పాత రోజులు మారాయని,ఇద్దరూ సమానమనే భావన వస్తుందని చెప్పారు. విద్యార్థినులు ఆత్మనూన్యతా భావం వదిలి అన్నిరంగాల్లో పోటీ పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఎస్ఐ చల్లారావు, టౌన్‌పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్లోబల్ ఛాలెంజ్ కెరీర్‌పై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కశింకోట రాజీవ్ గాంధీ ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో గ్లోబల్ ఛాలెంజ్ - కెరీర్ అవకాశాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఉమా శంకర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. డిప్లొమా చేసిన విద్యార్థినులకు పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో అద్భుత అవకాశాలు వున్నాయని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సుచరిత మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ ప్రిన్సిపల్ కె.శివ, విభాగాధిపతులు రమణ కుమార్, గణేష్, జగన్మోహిని, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కెరీర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

12న చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మునగపాక : జాతీయ ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12వ తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి కూలీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో బుధవారం ఉపాధి హామీ కూలీలతో ఆయన సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ ఆరువారాలుగా ఉపాధి హామీ కార్మికులకు వేతనాలు చెల్లించలేదన్నారు. ప్రతి వారం వేతనాలు చెల్లించాలని, పని ప్రదేశంలో కార్మికులు వినియోగిస్తున్న పని ముట్లుకు డబ్బులు ఇవ్వాలని, మంచినీరు, టెంట్లు, మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రోజుకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, 200 పని దినాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పసుపు రెడ్డి నర్సింగరావు, కడియం పద్మ, పి గోవిందమ్మ, జి నాగమణి, ఎస్ రాము, సిహెచ్. ఆదమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అనకాపల్లి : బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం విస్మరించిందని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అనకాపల్లి జిల్లా యువజన విభాగ అధ్యక్షులు జొన్నకోట చెన్నమూర్తి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం అనకాపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు పూర్తయినా బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చిందాన కృష్ణ, ఉమా శంకర్ ప్రసాద్, పాలతీర్థపు రాజు, ద్వారపూడి కృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలం తానాం జనసేన పార్టీ నాయకులు వర్రి పరదేశి నాయుడు పుట్టినరోజు వేడుకలు బుధవారం ఆయన స్వగృహంలో జరిగాయి. ఇందులో తానాం జనసేన పార్టీ నాయకులు ఆధ్వర్యంలో టెన్త్ క్లాస్ చదువుతున్న సుమారు 35 మంది విద్యార్థులకు స్టేషనరీ పెన్నులు, అట్టలు , పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, జనసేన నాయకులు డి.రాజశేఖర్, రొంగలి శ్రీను, గొరిపూటి సురేష్, పైల కుమార్, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డాదిలో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం

- పశువుల పాకలు, ధాన్యం, వరి కుప్పలు, టైరు బండి దగ్ధం
- భారీగా ఆస్తి నష్టం
- లబోదిబోమంటున్న బాధితులు
- ఎవరో కావాలనే నిప్పు పెట్టారని ఆరోపణ

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది కస్పా పొలాలు వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల పాకలు, వరి కుప్పలు, టైరు బండి దగ్ధమయ్యాయి. బుధవారం తెల్లవారుజామున బాధితులు చేసి చోడవరం అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇవ్వగా, సిబ్బంది చేరుకునే లోపే మొత్తం కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన కుబిరెడ్డి ప్రకాష్, దొరబాబు, ఈశ్వరరావు, లింగంపల్లి శోభన్ బాబుకు చెందిన 2 ధాన్యం కుప్పలు, పాకలో నిల్వ ఉంచిన 30 బస్తాల ధాన్యం, పశువుల పాకలు, టైరు బండి దగ్ధమయ్యాయి. ఎద్దులకు గాయాలయ్యాయి. భారీగా ఆస్తి నష్టం సంభవించింది. ఏడాది పాటు కష్టపడి పండించిన పంట మొత్తం అగ్నికి ఆహుతి కావడంతో బాధిత కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. పాకలు, కుప్పలు దూరంగా ఉన్నప్పటికీ మంటలు అంటుకోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరో కావాలనే మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత నిప్పు అంటించి ఉంటారని బాధితులు ఆరోపించారు.




అగ్నికి ఆహుతైన పశువుల పాక, వరి కుప్ప

బుచ్చయ్యపేట ఎస్సై శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల నుండి వివరాలు సేకరించారు. పోలీసులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దర్యాప్తు చేపట్టాలని గ్రామస్తులు బాధిత కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానిక టిడిపి కూటమి నేతలు దొండా నరేష్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, వైసిపికి చెందిన జడ్పిటిసి దొండా రాంబాబు తదితరులు ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

వ్యాపారాల వైపు యువత దృష్టి సారించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : యువత కొత్త ఆలోచనలతో వ్యాపారాల వైపు దృష్టి సారించాలని విశాఖ ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మురళీకృష్ణ అన్నారు. భారత ప్రభుత్వ మానవ వనరుల శాఖ సహకారంతో ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కెరీర్ అవకాశంగా ఎంటర్‌ప్రెన్యూర్ షిప్, ఇన్నోవేషన్‌పై దాడి వీరునాయుడు కళాశాలలో బుధవారం ఒక్కరోజు వర్క్ షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ, ఐఈఎస్ అడ్మిన్ ఎం కాలేబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే కొత్త కొత్త ఆలోచనలతో వ్యాపారాలను ప్రారంభించే దిశగా ప్రతి విద్యార్థి ఆలోచించవలసిన అవసరం ఉందన్నారు. ఇలా ఆలోచించే విద్యార్థుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో అవకాశాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎంటర్‌ప్రెన్యూయర్ షిప్ ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకులో సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేస్తున్నాయని తెలిపారు. సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపల్ ఎస్ దయా మాధురి, ప్లేస్మెంట్ ఆఫీసర్ యు నాగేశ్వరరావు, ఎస్ఆర్ జమీర్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నేత్ర పరీక్షలుచేస్తున్న దృశ్యం

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని రాజాం గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 136 మంది కంటి రోగులకు పరీక్షలు చేశారు. వారిలో 36 మందిని కంటి ఆపరేషన్ ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, శంకర్ ఫౌండేషన్ ఆప్తలమిక్ ఆఫీసర్ జాన్, క్యాంపు మేనేజర్ ఎం అరుణ్ కుమార్, నర్సింగ్ స్టాఫ్ గీత సాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి : జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 83 మంది కంటి రోగులకు పరీక్షలు జరిపి 45 మందికి కంటి ఆపరేషన్ ఎంపిక చేశారు. అనంతరం రోగులను శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పూజ్య మేఘన, డాక్టర్ వనజ, హెల్త్ సూపర్వైజర్ పుష్పరాజ్, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, శంకర్ ఫౌండేషన్ ఆప్తలమిక్ ఆఫీసర్ వివేక్ వర్మ, క్యాంపు కో-ఆర్డినేటర్ సిహెచ్ అశ్వని కుమార్, నర్సింగ్ స్టాఫ్ చాందిని వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాటు సారా అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-మునగపాక

మండలంలోని గంటవానిపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి నవోదయ 0-2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించిన నాటు సారా వల్ల కలిగి అనర్థాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఎక్సైజ్ సీఐ వై లక్ష్మి నాయుడు మాట్లాడుతూ నాటు సారా తయారు చేసినా, అమ్మినా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటు సారా సంబంధించి ఫిర్యాదు కొరకు 1440 5 టోల్ ఫ్రీ నెంబర్‌కి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై గణేష్, గ్రామ సర్పంచ్, పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై సర్వే

ప్రజాశక్తి-కశింకోట

ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై నీతి ఆయోగ్ తరుపున సంబోధి రీసెర్చ్ ఆర్గనైజేషన్‌కు చెందిన బృందం బుధవారం కశింకోట మండలం కొత్తపల్లిలో సర్వే చేశారు. సంబోధి రీసెర్చ్ ఆర్గనైజేషన్ ఫీల్డ్ మేనేజర్ వికాస్ మల్కర్, టీం సూపర్ వైజర్ వి.సంధ్యారాణి, రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్లు జి.సంధ్యారాణి, వి.లక్ష్మీకుమారి, పి.భానుచంద్ర, జి.లోకేష్ తదితరుల బృందం ఈ సర్వే చేపట్టారు. పిఎం ఆవాస్ యోజన, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల ఫించన్లు, స్వయం సహాయక బృందాల పనితీరు, నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ తదితర వివరాలను లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వి.రవికుమార్, ఈఓపిఆర్డి ఎం.వెంకటలక్ష్మి, డిటిఏంఇడిపి బి.చిన్నారావు, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ ధర్మారావు, ఐకెపి ఏపిఎం ఎన్.పార్వతి భాయ్, ఉపాధి హామీ పథకం ఏపిఓ ఎం.శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఇ వి.శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ శ్యామ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అనకాపల్లి జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ వైద్యాధికారి డాక్టర్ కె.చంద్రశేఖర్ దేవ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు శతశాతం సాధించాలని ఆదేశించారు. వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం శతశాతం పూర్తి చేయాలని సూచించారు. పిహెచ్‌సిలో వాక్సిన్ కోల్డ్ చైన్ నిర్వహణ, మెడికల్ స్టోర్స్, రికార్డ్స్ పరిశీలించారు. అనంతరం తాళ్లపాలెం-1 సచివాలయం పరిధిలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి ఎ.రామచంద్రరావు, జిల్లా కోల్డ్ చైన్ మేనేజర్ అరుణాచలం, పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ఎ.మనీషా, ఎంఎస్‌వి ప్రసాద్, సిబ్బంది వివి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుండి ఫిర్యాదులు రాకుండా రెవెన్యూ సేవలు

అధికారులను ఆదేశించిన కలెక్టరు విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజల నుండి ఫిర్యాదులు రాకుండా రెవెన్యూ సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో తహశీల్దార్లు, మండల కేంద్ర డిప్యూటీ తహశీల్దార్లతో పిజిఆర్ఎస్, రీసర్వే, అర్జీల పరిష్కారం, గ్రామసభలు, వెబ్ ల్యాండు, ఇళ్ల స్థలాల రీ-వెరిఫికేషను, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, రికార్డు రూమ్‌ల నిర్వహణ తదితర అంశాలపై కలెక్టరు విజయ కృష్ణన్, జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ధరఖాస్తులు, అర్జీలు నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూములలో పేదలు నిర్మించుకున్న స్థలాల క్రమబద్దీకరణకు గూర్చి ప్రజలకు తెలియజేయాలని, విస్తృత ప్రచారం కల్పించి అర్హులైన వారి చేత ధరఖాస్తు చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంక్షేమ పథకాలపై ప్రజలనుండి ఐవిఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నదని, దానిద్వారా ఫిర్యాదులు వస్తే విచారణ అనంతరం సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి మాట్లాడుతూ రీ-సర్వే, గ్రామసభలలో వచ్చిన అర్జీలన్నింటిని రెండు రోజులలో పరిష్కారం చేయాలని ఆదేశించారు. వెబ్ లాండులో మార్పులు కోసం వచ్చే ప్రతిపాదనలు సర్వే నంబరు, సబ్ డివిజను పూర్తి వివరాలతో పంపించాలన్నారు. వివాదాస్పద భూముల వివరాలు నమోదుచేయునపుడు మొత్తం సర్వేనంబరు కాకుండా సంబంధిత భాగం వివరాలు మాత్రమే నమోదుచేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, కెకెఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి, బిజెఆర్‌యుఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.రమామణి, ఆర్‌డిఒలు వి.వి.రమణ, షేక్ ఆయిషా, కలెక్టరేట్ పరిపాలనాధికారి బి.వి.రాణి, సెక్షను సూపరింటెండెంట్‌లు, సర్వేశాఖ సహాయ సంచాలకులు గోపాలరాజు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు

అనకాపల్లి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణ కోసం, జిల్లా, మండల స్థాయిలో ఏర్పాట్లు చెయ్యాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పాట్లపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిడిఓలు, మునిసిపల్ కమీషనర్లు, సిడిపిఓ.లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆ రోజు మహిళల భద్రత కోసం మహిళా శక్తి యాప్‌ను, ప్రత్యేకంగా జిల్లా స్థాయిలో స్త్రీలు, పిల్లల విభాగాన్ని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. యాప్ గురించి మహిళలకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎమ్.దేవ ప్రసాద్‌ను ఆదేశించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు హెల్త్ చెకప్ చేయాలని, మెడికల్ క్యాంపులు పెట్టాలని, న్యూట్రిషన్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో వివిధ రంగాల్లో విజయవంతమైన మహిళలను సన్మానించాలన్నారు. బ్యాంకర్లు స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు ఇవ్వాలని, పీఎంఈజిపి, ఎంఎస్ఎంఈ రుణాలు, పీఎం విశ్వకర్మ, ముద్ర లోన్స్ మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా అదనపు ఎస్పీ ఎమ్.దేవా ప్రసాద్, ఐసిడిఎస్ పిడి కె.అనంత లక్ష్మి , డిఆర్డిఏ పిడి. శచిదేవి, డిఎంహెచ్ఓ పి రవి కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగ రాజారావు, మెప్మా పిడి ఎస్ సరోజినీ, ఎస్సీ, బిసి కార్పొరేషన్ ఇడిలు పెంటోజీ రావు, కె.పద్మ, ఎంపిడిఓలు, సి.డి.పి.ఓ.లు మునిసిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం


బహుమతులు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ తరగతి నమూనా పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అచ్యుతాపురం హైస్కూల్ ఆవరణలో బుధవారం ఎస్సై సుధాకర్‌రావు చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నిర్వహించిన నమూనా పరీక్షలు విద్యార్థులకు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు మత్తు పానీయాలకు, సోషల్ మీడియా యాప్‌లకు బానిసలు కాకూడదని హితవుపలికారు. బాల్య వివాహాలు బాలికలకు రూపొందించిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం రమణ మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి నమూనా పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. నమూనా పరీక్ష 500 మంది విద్యార్థులు రాశారని, వారిలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన ఆర్ ప్రసన్న, జి యశ్వంత్, డి గణదీప్తి, ఎం లక్ష్మీ శివాని, కె మోహన్ సాయి, హైందవి, కె హాసిని, కే జోష్నా, ఆర్ పుష్ప తదితర పదిమంది విద్యార్థులకు బహుమతులు అందించామని తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి ఎం.రామ్‌కుమార్, హైస్కూల్ హెచ్ఎం శాస్త్రి, భవాని స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఐవిఏ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం నూకరాజు, డివిజన్ నాయకులు దాసు రామలక్ష్మణులు, డివైఎఫ్ఐ నాయకులు కె సోము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

ప్రజాశక్తి-సబ్బవరం : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నామని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు అన్నారు. మండలంలోని అసకపల్లి, అమ్ములపాలెం గ్రామాల్లో బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుండి 30వ తేదీ వరకు గాలి కుంటువ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ టీకాలు వేస్తే వ్యాధిసోకిన పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గడాన్ని శాశ్వతంగా నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ స్వర్ణలత, సహాయకులు కె.లక్ష్మణరావు, యు.శ్రీనివాసరావు, పాడి రైతులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : నాలుగు నెలల దాటి ఎనిమిది నెలల లోపు వయసు కలిగిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని తారువ, మామిడిపల్లిలో జరుగుతున్న వ్యాక్సిన్ కార్యక్రమాలను ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. బ్రుష్ ల్లా వ్యాక్సిన్ వలన కలిగే ప్రయోజనాలు, టీకాలు వేసుకోకపోతే కలిగే నష్టాల గురించి రైతులకు వివరించారు. అనంతరం మామిడిపల్లి పశు వైద్యశాలలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఈ దినేష్ కుమార్, వైద్యాధికారులు మంజుషారాణి, జి.ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూకాంబిక జాతరలో బాలల హక్కులకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉగాది నుండి నెలరోజులపాటు జరగనున్న అనకాపల్లి నూకాంబిక అమ్మవారి వార్షిక జాతరలో బాలల హక్కులకు ప్రాధాన్యత కల్పించాలని, బాలలకు వారికి కావలసిన సౌకర్యాలు కల్పించాలని ఏపి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో వార్షిక ఉత్సవాలపై దేవస్థానం అధికారులు, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు, సిబ్బందితో సీతారాం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ క్యూ లైన్లలో ఉండే పిల్లలకు బిస్కెట్లు, వేడిపాలు పంపిణీకి చర్యలు చేపట్టాలని, రద్దీలో తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చేందుకు 1098 చైల్డ్ లైన్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారుల సమన్వయానికి తీసుకోవలసిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం ఇఒ ఎన్.సుజాత, ఐసీడీఎస్ పిఒ కె.అనంతలక్ష్మి, చైల్డ్ డెవలప్మెంట్ పిఒ పి.ప్రభావతి, కార్మిక శాఖ అధికారులు కె.వసంతరావు, కె.బాలకృష్ణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, బాలల రక్షణాధికారి కెవెల్.మనోహర్‌రావు, లీగల్ కం ప్రొబేషన్ అధికారి బి.రమాదేవి, సామాజిక కార్యకర్తలు కె.రమ్య, డి.లోవరాజు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షల్లో..

ఈ నెల 17 నుండి జరగనున్న పదోతరగతి వార్షిక పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల హక్కులతో ముడిపడి ఉన్న సంక్షేమానికి జిల్లా అధికారులు ప్రాధాన్యతనివ్వాలని ఏపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. జిల్లా విద్యాశాఖ, సర్వ శిక్షా అభియాన్ అధికారులతో బుధవారం స్థానిక జివిఎంసి బాలికల హైస్కూల్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రంలోని శ్రీవేణు విద్యానికేతన్‌లో 6, 7, 8 తరగతులు చదువుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందిన 44 మంది విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి కే రత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులకు మంచి నడవడికతో పాటు సమాజంలో భావిభారత పౌరులుగా తయారయ్యేందుకు అవసరమయ్యే శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్ వై.సోనీ, వేణు విద్యానికేతన్ కరస్పాండెంట్ వేణు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి పకడ్బందీగా పి4 సర్వే

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి -కోటవురట్ల: ఈనెల 8 నుంచి నిర్వహించనున్న పి ఫోర్ సర్వేపై బుధవారం తాహసిల్దార్ కార్యాలయంలో మండల పరిషత్ సిబ్బందితో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు, పి ఫోర్ సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, నిర్లక్ష్యం చేయరాదని సిబ్బందిని ఆదేశించారు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు, కార్యక్రమంలో ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు పలువురు గ్రామ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రావికమతం : ప్రభుత్వం ఉగాది సందర్భంగా పేదరిక నిర్మూలన కోసం ప్రారంభించనున్న పీఫోర్ సర్వేను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఎంపిడిఒ వెంకన్న బాబు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి బుధవారం సమావేశం నిర్వహించారు. మండలంలో అన్ని సచివాలయాల పరిధిలో అట్టడుగున ఉన్న 20 కుటుంబాలను ఈనెల 8 నుంచి 18లోగా గుర్తించాలని తెలిపారు. సర్వేలో గుర్తించిన కుటుంబాలకు ప్రభుత్వపరంగా పథకాలను అందజేసి, వారిని పేదరికం నుంచి బయటపడేసే చర్యలను ప్రభుత్వపరంగా చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎఒ సీతారామస్వామి, ఇఒపిఆర్‌డి భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ తీర్మానాలు అమలు చేస్తున్నా

ప్రజాశక్తి -కొత్తకోట :పంచాయతీ పాలకవర్గ తీర్మానాలను ఎటువంటి అలసత్వం లేకుండా అమలు చేస్తున్నట్లు కొత్తకోట పంచాయతీ కార్య నిర్వాహణధికారి జ్యోతిరెడ్డి స్పష్టం చేశారు. సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపిటిసి, ఇతర పెద్దలు తనపై చేసిన ఆరోపణల ఫిర్యాదుకు స్పందించి, పంచాయతీ కార్యాలయంలో వివరణనిచ్చారు. .

మార్కెట్‌యార్డ్ లో దుకాణాల ఏర్పాటుకు వ్యాపారులు మక్కువ చూపడం లేదని, పలు మార్లు తాను ప్రయత్నం చేసినా ఫలితం లేదన్నారు. ఆలయాలు వద్ద మాంసం, చేపల దుకాణాల నిర్వహణపై గ్రామసభ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. మండలస్థాయిలో సమావేశాలకు హాజరైన సందర్భాల్లో తప్ప, తాను పని వేళల్లో పంచాయతీ కార్యాలయంలో విధుల నిర్వహణలో ఉంటున్నానన్నారు. పంచాయతీ పాలకవర్గంతో అవగాహన లోపం లేకుండా సమన్వయంతోనే విధులు నిర్వహిస్తున్నారని స్పష్టం చేశారు.

జనసేన ఆవిర్భావ సభకు రండి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఈ నెల 14న జరిగే జనసేన ర్టీ ఆవిర్భావ సభ పోస్టర్లను బుధవారం నర్సీపట్నంలో జనసేనటౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేశ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ జనసేన ఆవిర్భావ సభకు భారీగా నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మారిశెట్టి రాజా, అశ్విన్, బైనా మురళి, గణేష్, ప్రగాఢ చినబాబు, కర్రి సంతోష్, నాని, కిరణ్, లంక వీరపాత్రుడు, చిరంజీవి శ్రీను, నాలుగు మండలాల జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

కర్ర స్తంభాలపై విద్యుత్ లైన్!

- అందేంత ఎత్తులో ప్రమాదభరితంగా కరెంట్ వైర్లు
- 'చోద్యం' చూస్తున్న విద్యుత్ యంత్రాంగం





చోద్యంలో కర్రస్తంభాలపై వ్యవసాయ బోర్లకు వెళ్లే విద్యుత్ లైన్

పజాశక్తి-గొలుగొండ : మండలంలో చోద్యం పరిధిలో రైతులకు వ్యవసాయ మోటార్లకు ఇచ్చిన విద్యుత్ లైనులోని వైర్లు, కరెంట్ స్తంభాలు బిగించకుండా ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. రైతులు పలుమార్లు ట్రాన్స్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సమస్యను పట్టించుకోవట్లేదని సాగు రైతు మద్దపు భాస్కరరావు విలేకరులకు తెలిపారు. విద్యుత్ వైర్లు కిందకి వేలాడుతూ ప్రమాద భరితంగా ఉండడంతో, ఎటువంటి ప్రమాదాలు జరగకూడదని ఉద్దేశంతో కర్రల సహాయంతో వైర్లను నిలబెట్టుకున్నామన్నారు. వ్యవసాయ భూములకు వెళ్లడానికి ఏ క్షణం ఏ ప్రమాదం ఎదురవుతుందని భయంతో ఉండాల్సి వస్తుందనిభయాందోళన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లను కరెంటు స్తంభాలకు అమర్చాలని, లేని పక్షంలో జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

పిహెచ్‌సిని సందర్శించిన ప్రోగ్రాం ఆఫీసర్



వైద్యులకు సూచనలు చేస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్

ప్రజాశక్తి-గొలుగొండ : స్థానిక పిహెచ్‌సిని బుధవారం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి సందర్శించారు. ఈ సందర్భంగారికార్డులను పరిశీలించారు. అనంతరం జోగుంపేట హెచ్‌డబ్ల్యూసీని సందర్శించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలోనూ ఎన్‌సిడి 3.0 సర్వే గురించి ఆరా తీశారు. అనంతరం వైద్యాధికారులతో సమావేశమై రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఎటువంటి ఆరోపణలకు తావు లేకుండా చూడాలన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణను పట్టించుకోరా?



వెంకటాపురం వెళ్లే దారిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో లింగాపురం గ్రామంలో వెంకటాపురం వెళ్లే ప్రధాన రహదారిని అనుకుని సర్వేనెంబరు 73/2లో దాదాపు 60 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్న రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారిని అనుకునే ప్రభుత్వభూమి ఆక్రమణకు గురైనా, అధికారులు చోద్యం చూస్తుండడంపై అధికారులు నిర్లక్ష్యాన్ని పలువురు చర్చించుకుంటున్నారు, గతంలో ఇదే భూమిని జగనన్న కాలనీ లబ్ధిదారులకు అందజేయాలని 2020లో నాటి రెవెన్యూ అధికారులు విఫల యత్నం చేశారు, ప్రస్తుతం ఆ భూమి ఆక్రమణకు గురికావడంతో ఆక్రమణదారులు పశుగ్రాసం సాగు చేసుకుంటున్నారు, ఆక్రమణకు గురైన భూమి సమీపంలోనే లింగాపురం చెరువు మిగులు నీరు, సాగునీటి కాలువ ఉండటం విశేషం. ఆక్రమణకు గురవుతున్న విలువైన భూములను గుర్తించి, వాటిని పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

చెత్త సేకరణకు సహకరించండి

ప్రజాశక్తి-గొలుగొండ : చెత్తను రోడ్లపై వేయకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని గొలుగొండ మండలం సీహెచ్. నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురామ చంద్రరావు కోరారు. బుధవారం పంచాయతీలో ప్రత్యేక చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చెత్తను రోడ్లపై వేయకుండా తడి,పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని కోరారు.

వెంకన్న కల్యాణోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి :ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణోత్సవ ఏర్పాట్లపై బుధవారం ఆలయ ప్రాంగణంలో అధికారులు, కూటమి నాయకులు సమీక్షించారు. ఈనెల 9న అంకురార్పణతో ప్రారంభమై 17వ తేదీతో ఉత్సవాలు ముగుస్తాయని, ఇందులో భాగంగా 10న ధ్వజారోహణం, రథోత్సవం, కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుండి వేలాది మంది భక్తులు దర్శించుకునేందుకు రానున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ ప్రగడ వీరబాబు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ లు కొప్పిశెట్టి బుజ్జి, ఆకేటి గోవిందరావు, ఎంపిడిఒ డి సీతారామరాజు, ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యులు, సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్ని బాబు , ఎలక్ట్రికల్ ఏఈ కష్ణ, కూటమి నాయకులు ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయవలసిన ఏర్పాట్లు పై చర్చించారు. స్వామి కల్యాణం తిలకించేందుకు ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేయడం, శానిటేషన్‌పై ప్రత్యేక దష్టి సారించాలని, ఇందుకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పుష్కరిణి వద్ద గజ ఈతగాళును ఉంచాలని, స్నానాలు ఆచరించే మహిళా భక్తులకు ప్రత్యేక వసతి, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తీసుకోవలసిన చర్యలు, ఇతర ఏర్పాట్లుపై చర్చించారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న పనులు పరిశీలించారు. ఆలయ పరిసర ప్రాంతాలు, స్వామికళ్యాణ వేదిక, భక్తుల క్యూలైన్, వీఐపీల దర్శనం, కేశఖండనశాల, భక్తులు స్నానాలు ఆచరించే పుష్కరిణి, వీఐపీల వాహనాల పార్కింగ్, వైద్య శిబిరం ఏర్పాటు ప్రాంతాలను పరిశీలించి, పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కురందాసు నూకరాజు, వెలాగా సుధాకర్, కోసూరి శ్రీనివాసరావు, కొప్పిశెట్టి శ్రీను, వెంకటేశ్వరరావు, కక్కిరాల సురేష్, వరహాలరావు, దొరబాబు, వాసు, తోట అప్పారావు, పిక్కి సత్తియ్య, గంగరాజు, శివ, ఇన్చార్జ్ ఈవోపీఆర్డి ఎం శ్రీను, పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్ పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత భవిష్యత్తు



మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రసాద్

ప్రజాశక్తి -నక్కపల్లి : విద్యతో ఉన్నత భవిష్యత్తు ఉంటుందని మనబాలవానిపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం నక్కపల్లి డిగ్రీ కళాశాలలో బాలికల కెరీర్‌పై అవగాహనలో మాట్లాడుతూ, బాలికలు లక్ష్యం నిర్దేశించుకుని, దాని సాధనకు కృషి చేయాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. రామచంద్ర మిషన్ ట్రైనర్ రామకృష్ణ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా పరీక్షలు రాయాలన్నారు. ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శివయ్య, అధ్యాపకులు జాన్ కిరణ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత, సీడ్ ఆర్గనైజర్ అమ్మాజీ,రాజబాబు, అమలావతి, అంగన్వాడిలు దుర్గా రాణి,జయ,అపర్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి : అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు ఆధ్వర్యంలో నక్కపల్లి గురుకులంలో విద్యార్థినులకు లింగసమానత్వం అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

బుచ్చయ్యపేట :అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుచ్చయ్యపేట పోలీసు వారి ఆధ్వర్యంలో బుధవారం తురకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కశింకోట : మహిళా దినోత్సవ వారోత్సవాలు సందర్భంగా కశింకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అల్లు స్వామి నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని కన్నూరుపాలెం విజ్ఞాన్ విహార్ స్కూల్‌లో విద్యార్థులకు బుధవారం పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థుల్లో లింగ సమానత్వం, సృజనాత్మకతను పెంపొందించడం, మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేయడమే లక్ష్యంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రశంసించారు. ఈ కార్యమంలో విద్యాసంస్థ ప్రతినిధులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో ఇసిసిఇ డే

ప్రజాశక్తి- నక్కపల్లి : నక్కపల్లి వీవర్స్ కాలనీ, కొత్తపేట అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతినెలా 5న ఇసిసిఇ డే ను బుధవారం నిర్వహించారు. పిల్లల సంరక్షణ,విద్యపై ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు దుర్గారాణి, జయ లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని ఏఎల్.పురం అంగన్వాడీ కేంద్రం-4లో ఇసిసిఇ డేలో భాగంగాఅంగన్వాడీ కార్యకర్త మంగతాయారు ఆధ్వర్యంలో బుధవారం పిల్లలకు అన్నప్రావన చేయించారు. అంగన్వాడీ కేంద్రాల్లో జరిగే కార్యక్రమాల తల్లిదండ్రులకు వివరించారు

అగ్ని ప్రమాదంలో హోటల్ దగ్ధం

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో సుంకపూరు గ్రామంలో జి అప్పారావు అనే వ్యక్తి నిర్వహిస్తున్న చిన్న హోటల్ మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో హోటల్‌లోని రెండు ఫ్రిజ్‌లు, గ్రైండర్, ఇతర సామగ్రితోపాటు ఒక ద్విచక్ర వాహనం, రూ. 30 వేల నగదు కాలి బూడిదయ్యాయి, సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితునికి నిత్యావసరాలను విఆర్ఒ పెద్దన్న దొర అందజేశారు, బాధితుల్ని గ్రామంలోని జనసేన పార్టీ మండల నాయకులు సిహెచ్ శ్రీనివాస్ పరామర్శించి ప్రభుత్వ నుంచి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతులు, కార్మికులకు బడ్జెట్‌లో అన్యాయం



నిరసన వ్యక్తం చేస్తున్న సంఘం నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో రైతాంగానికి, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి, వ్యవసాయ కార్మికులకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం చాలా బాధాకరమనిఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలుగుల అర్జునరావు, మాకిరెడ్డి రామునాయుడు అన్నారు. బుధవారంనర్సీపట్నం సబ్ కలెక్టరేటు వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలతో ధర్నా నిర్వహించారు. డిటికి వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, గ్రామీణ ఉపాధి కూలీలకు దినసరి వేతనం రూ.700తో ఏటా 200 రోజులు పని దినాలు కల్పించాలని, ఉపాధి పనులను యంత్రాలతోకాకుండా కూలీలతో చేయించాలని, వలసలను నివారించాలని కోరారు. ఉపాధి పనిప్రదేశంలో టెంట్లు, నీళ్ళ, మజ్జిగ మెడికల్ కిట్లు సదుపాయం కల్పించాలని, 50ఏళ్ళు నిండిన వ్యవసాయ కార్మికులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘ గౌరవ అధ్యక్షులు శివలంక కొండలరావు, నల్లబిల్లి శ్రీరామమూర్తి, ఎం.భాస్కరరావు, రైతు సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు మర్రి బాబులు, మేకా సత్యనారాయణ, డి.రాంబాబు, ఎల్వి.రమణ, శెట్టి పైడియ్య, ఆదిరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై వర్క్‌షాప్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆర్గానిక్ ఫార్మింగ్‌లో మహిళ వ్యవస్థాపకతపై వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ విద్యార్థినులు పారిశ్రామికవేత్తలుగా రాణించాలని పిలుపునిచ్చారు. వృక్షశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ టిఎన్ఎ నివేదిత సదస్సు కన్వీనర్‌గా వ్యవహరించారు. రీసోర్స్ పర్సన్ డాక్టర్ హరీష్ ఆర్గానిక్ ఫార్మింగ్ ప్రాముఖ్యత, ఈ విధానంలో పారిశ్రామిక వేత్తలుగా ఎదగడమెలాగో వివరించారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ జె.లావణ్య (గ్రీన్ క్లబ్ కన్వీనర్), ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ ఎస్.అనూష,వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి కళాశాల అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు

ఉచితంగా కృత్రిమ చేతుల పంపిణీ

ప్రోస్థటిక్ ఆర్మ్స్‌క్యాంపును ప్రారంభించిన సిపి బాగ్చీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రమాదాలలో అవయవాలు కోల్పోతున్న వారికి విశాఖలో ఉచిత ప్రోస్థటిక్ ఆర్మ్స్ క్యాంప్ ఒక వరమని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. బుధవారం మహారాణి పేట, సింధు భవనంలో ఇనాలి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ప్రోస్థటిక్ ఆర్మ్ క్యాంప్ ఉచిత క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదాలలో అవయాలు కోల్పోయిన వారికి కృత్రిమ అవయవాలను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించి, పోలీస్ శాఖ తరపున తమ వంతు సహకారం ఉంటుందన్నారు. విశాఖ సేఫ్టీ కౌన్సిల్ (ట్రైనింగ్, డెవలప్మెంట్ ట్రస్ట్) సమన్వయకర్త బాల సతీష్ మాట్లాడుతూ రెండు రోజులపాటు నిర్వహించే శిబిరానికి ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో 50 మందికి పైగా నమోదు చేసుకున్నారన్నారు. తమ సంస్థ ద్వారా ఇంతవరకూ 12 వేలమందికి కృత్రిమ చేతులను ఉచితంగా అందజేశామన్నారు.

జల్‌జీవన్ మిషన్ నిధుల మంజూరు

ప్రజాశక్తి- మాడుగుల : కేంద్ర ప్రభుత్వ జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా మాడుగుల మండలానికి రూ.కోటి 16 లక్షల నిధులు మంజూరైనట్టు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. జెడి పేట గ్రామానికి రూ.58 లక్షలు, పోతనపూడి గ్రామానికి రూ.28 లక్షలు, సాగరం గ్రామానికి రూ.30 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

రోడ్డు నిర్మించాలని వినూత్న నిరసన

డోలీ మోతలతో డొంకాడ గిరిజనుల ఆందోళన



డోలీ మోతలతో ర్యాలీగా వస్తున్న డొంకాడ గిరిజనులు

ప్రజాశక్తి-గొలుగొండ : తమ గ్రామానికి తక్షణమే రోడ్డు సౌకర్యం కల్పించాంటూ గొలుగొండ మండలం కె.ఎల్లవరం పంచాయతీ డొంకాడ పివిటిజి గిరిజనులు బుధవారం ఆందోళన చేపట్టారు. డోలి కట్టి వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 29 మంది కుటుంబాలు 180 మంది జనాభా జీవనం సాగిస్తున్నారన్నారు. కరక ఆర్అండ్‌బి రోడ్డు నుండి డొంకాడ వరకు కిలో మీటరున్నర దూరం ఉందన్నారు. తమ గ్రామానికి జిఒ 726 ఐ ఇన్ఫాక్ట్ నిధులు ఆర్ఆర్ ప్రాజెక్టు కింద 2023 అక్టోబర్‌లో రూ. ఒక కోటి 35లక్షల నిధులు బిటి రోడ్డుకు నిధులు మంజూరు చేశారన్నారు. అయితే అటవీశాఖ అనుమతులు లేవని రోడ్డు పనులు ప్రారంభించలేదని, ఈలోగా ఎన్నికలు రావడంతో వీటి ఊసెత్తే వారు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.
. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా రోడ్డువైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. దీనిపై జనవరి 22వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో డోలీలు కట్టి, అడ్డాకులు నెత్తి మీద పెట్టుకొని వినూత్నంగా ఆందోళన చేపట్టామన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ డొంకాడ గ్రామానికి చెందిన ఫారెస్ట్ అనుమతులు మంజూరు చేశారన్నారు. జిల్లాలో ఎక్కడా ఫారెస్ట్ అనుమతులు సమస్యలు లేవని పీఆర్ ఈఈ కూడా తెలిపారన్నారు. అయితే నేటి వరకు ఎన్నికల కోడ్ కారణంగా పనులు ప్రారంభించలేదని పిఆర్ అధికారులు చెప్పారన్నారు. ఇపుడు అవన్నీ పోయిన నేపథ్యంలో తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. రోడ్డు సౌకర్యంల లేకపోవడంతో గ్రామానికి చెందిన తాంబలి జ్యోతి, గెమ్మెల లక్ష్మీ, తాంబలి అనే ముగ్గురు గర్భిణులను డెలివరీలకు డోలిలో ఆసుపత్రులకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో ప్రసవించారన్నారు.రోడ్డు సౌకర్యం లేక గ్రామంలో 13 మంది పిల్లలు చదువుకోవడం కోసం ఆరు కిలో మీటర్లు రానుపోను కాలినడకన వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. వర్షాకాలం వస్తే స్కూల్‌కు వెళ్లలేని పరిస్తితి ఉందన్నారు. గతంలో ప్రత్యామ్నాయ పాఠశాల ఉండేదని, కానీ దాన్ని ఎత్తేయడంతో గిరిబాలలల చదువుకు పాట్లు తప్పడం లేదన్నారు.. తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించాలని, లేకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద డోలిలతో ఆందోళన చేపడతామని గ్రామస్థులు తాంబలి అప్పారావు, తాంబలి సత్తిబాబు, మర్రి పోతురాజు ఆదివాసీ గిరిజన మహిళలు హెచ్చరించారు.

వైసిపి, టిడిపి దొందూదొందే

- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేస్తున్నారు
- కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ మాజీ ఎంపీ తులసిరెడ్డి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైసిపి, టిడిపి కూటమి పార్టీలు రాష్ట్రానికి పట్టిన రాహు కేతువు లని రాజ్యసభ మాజీ సభ్యులు, ఎపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసిరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసిపి, టిడిపి కూటమి దొందూ దొందే అన్నారు. వైసిపి అరచేతిలో వైకుంఠం చూపిస్తే, కూటమి కైలాసం చూపిస్తోందని ఎద్దేవా చేశారు. వైసిపి రాష్ట్రాన్ని అప్పుల అరాచక, మద్య,జూద, గంజాయి, డ్రగ్స్ ఆంధ్ర ప్రదేశ్ చేసిందన్నారు. కూటమి పాలనలో రాష్ట్రపరిస్థితి పెనం మీద నుండి నిప్పుల పొయ్యిలో పడ్డట్టు తయారైందని ఎద్దేవా చేశారు. అప్పుల విషయంలో వైసిపికి కూటమి ప్రభుత్వం ఏమాత్రం తీసిపోలేదని, .2023-24లో వైసిపి ప్రభుత్వం రూ.79,775 కోట్లు అప్పు చేయగా, 2024- 25లో కూటమి ప్రభుత్వం రూ. 98,756 కోట్లు అప్పు చేసిందన్నారు. 2025- 26లో రూ.1,04,383 కోట్లు అప్పు చేస్తామని బడ్జెట్ లో పేర్కొందన్నారు. ప్రత్యేక హోదా సాధించడంలో,రాయల సీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ సాధనలో రెండు పార్టీలు విఫల మయ్యాయన్నారు. నిరుద్యోగభృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం, మహాశక్తి వంటి సూపర్ సిక్స్ పథకాలకు ఎసరు పెట్టారని, ఎస్సి, ఎస్టి, బిసి, ముస్లిం మైనారిటీలను మోసపుచ్చారన్నారు. సాగునీటి రంగాన్ని వైసిపి మాదిరిగానే కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. అన్ని వర్గాలను నమ్మించి మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే అర్హత లేదని తులసి రెడ్డి విరుచుకు పడ్డారు సమావేశంలో డిసిసి అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మరాజు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు ,విశాఖ నగర అధ్యక్షులు పిరిడి భగత్, ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్, సమన్వయకర్త సూర్యనారాయణ, సీనియర్ నాయకులు కస్తూరి వెంకటరావు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఉపమాక విద్యుత్ సబ్ స్టేషన్ ఎన్‌సిసి 11 కెవి ఫీడరు పరిధిలో చెట్లు కొమ్మలు తొలగింపు, నిర్వహణ, మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు రాజయ్యపేట, బోయపాడు, తమ్మయ్య పేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎఇఇ కృష్ణ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ



జెడ్‌సికి సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణను నిత్యం పర్యవేక్షించాలని జివిఎంసి అధికారులను జిల్లా కలెక్టర్, ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో బుధవారం జివిఎంసి జోన్ 2 పరిధిలో జోడుగుళ్ళ పాలెం నుంచి గీతం కాలేజీ, రుషికొండ తదితర ప్రాంతాలలో పర్యటించారు.ముఖ్యమంత్రి పర్యటించే మార్గంలో రోడ్డుపై వ్యర్థాలు, చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని, గుంతలను వెంటనే పూడ్చాలని ఆదేశించారు. కేబుల్ వైర్లు ఏర్పాటుకు తీసిన గోతులు పూడ్చడంలో జాప్యం జరిగితే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సెంటర్ మీడియన్ లలో ఒరిగిన గ్రిల్స్‌కు మరమ్మత్తులు చేపట్టి సరిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగిసినందున కూడళకలలో పలునాయకుల విగ్రహాలకున్న ముసుగులను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ హైలాండ్లలో, ప్రధాన జంక్షన్ లలో మొక్కలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, సెంటర్ మీడియన్‌లలో ఎండిపోయిన మొక్కలను తొలగించి కొత్తగా మొక్కలు నాటాలని డిడిహెచ్ దామోదరరావుకు ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ శివప్రసాద్ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణ రాజు, ఎసిపి తిరుపతిరావు,జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

గంజాయి నిరోధానికి పటిష్ట చర్యలు



నాతవరంలో పోలీసులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎస్‌పి సిన్హా

ప్రజాశక్తి- నాతవరం : జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుక్ు ఆకస్మిక తనిఖీలు (డైనమిక్ చెకింగ్) నిర్వహించాలని జిల్లా ఎస్‌పి తుహిన్‌సిన్హా స్పష్టం చేశారు. గంజాయి అక్రమ రవాణాపై టోల్‌ఫ్రీ నెంబర్ 1972 ద్వారా సమాచారం అందించాలనే విషయంపై ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం నాతవరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేశారు. స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల ఫైళ్లను పరిశీలించి, వాటి పురోగతిపై ఎస్‌ఐ చింతల భీమరాజుకు సూచనలు చేశారు. స్టేషన్ ప్రాంగణంలో సీజ్ చేసిన వాహనాలకు కేసుల వివరాలను ట్యాగ్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజురోజుకు పెరుగుతున్నసైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీటిపై అవగాహనకు పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు, ప్రధాన కూడళుఉల, ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రజల సహకారంతో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్ సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తరచూ పర్యటించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించేందుకు పోలీసులుకఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.నాతవరం పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని సందర్శించి, నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. స్టేషన్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.

గొలుగొండ : జిల్లా ఎస్‌పి తుహిన్‌సిన్హా బుధవారం సాయంత్రం గొలుగొండ, కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్లలోని రికార్డులను తనిఖీ చేశారుపెండింగ్ కేసులు వివరాలను ఎస్సై రామారావు, తారకేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు, గంజాయి అక్రమ రవాణా నియంత్రణపై దృష్టి పెట్టాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్, రహదారి భద్రత, సైబర్ క్రైమ్ వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కృష్ణదేవిపేట పోలీస్‌స్టేషన్ త్వరలో వాహనాన్ని సమకూరుస్తున్నట్లు తెలిపారు. అనంతరం నిర్మాణాలు పూర్తయిన గొలుగొండ, కెడిపేట పోలీస్‌స్టేషన్ల భవనాలను సందర్శించారు.కార్యక్రమంలో డిఎస్‌పి పి..శ్రీనివాసరావు, నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ పాల్గొన్నారు.